

# తను మనిషి కాడా!?

— యస్పెప్జీ

తన కోసం ఎవరో వచ్చారని చెబితే చూస్తున్న ఫైలును మూసేసి హడావుడిగా బయటికి నడిచాడు మూర్తి.

అతన్ని చూసి ఆశ్చర్యపోయేడు ...

నల్లని రూపం. తక్కువ రకం గుడ్డలు. దువ్వని తల. చెప్పులు లేక దుమ్ముతో వున్న కాళ్ళు. భుజాన ఓ పాత కండువా. చేతిన సంచీ.

అతను ... అతను ... ఆంజనేయులు:

తను మైలవరంలో పనిచేసే రోజుల్లో తమకు పాలు పోస్తుండే వాడు. తాను వూరి నుంచి వచ్చేసి సంవత్సరం దాటింది. ఇప్పుడితను పనిగట్టుకుని వెతుక్కుంటూ రావడంలో అర్థం...?

"అ్రరే! ... ఆంజనేయులు నీవటోయ్! ఎప్పుడు రావడం? ఏవిటీ ... ఈ వూళ్ళో నీకు బంధువులు వున్నారా!" అనదుగుతూ చుట్టూ చూసేడు. తనని ఎవరైనా గమనిస్తున్నారేమోనని.

ఈ వచ్చినతన్ని ఎక్కడ తన బంధువుగా భావిస్తారోనని అతని భయం పాపం.

"బంధువులు వున్నారండి. మా మేనమామ గారి వూరు ఇదే. ఆయన కూతురు పెళ్ళైతే వచ్చానండి. నిన్న రాత్రే అయిపోయిందండి. ఎలాగూ ఇంత దూరం వచ్చాను కదా తమర్ని కలుసుకుని పోదామని వచ్చానండి."

"ఆహా! అలాగా! మంచిది. ఇంకా ఏవిటి విశేషాలు? అందరూ బావున్నారా? నీ పాల వ్యాపారం ఎలా వుంది?" ఏదో అడగాలని, నవ్వు తెచ్చుకుంటూ.

"పర్లేదండీ"

నవ్వేదు మూర్తి.

"ఆ ఇంకా ఏవిటి విషయాలు ..." అంటూ టైమ్ చూసుకున్నాడు.

"ఏమున్నయ్ సార్! అంతా బాగానే వున్నాం ... తమ విషయాలే తెలియాలి సంవత్సరం దాటిపోయింది తమరు ఈ వూరు వచ్చేసి... అందరూ ఈ వూరికి అలవాటుపడ్డారా సార్! పిల్లలు ఎలా వున్నారు! బుజ్జి అలాగే వున్నాడా ఏమైనా లావయ్యాడా ... సునంద అల్లరి చేస్తుందా? అమ్మగారు ఎలా వున్నారు?" ఎంతో ఆసక్తిగా ఆతృతగా అడిగేడు ఆంజనేయులు.

తన కుటుంబ సభ్యుల్ని అతను పేరు పేరునా గుర్తుంచుకోవడం చూస్తే కాస్తంత ఆశ్చర్యంగానూ ఆనందంగానూ అన్పించింది మూర్తికి.

"అందరూ బానే వున్నారోయ్. మా పిల్లలు అందరూ నీకు గుర్తేనే..."

"అదేంటి సార్! అంధరూ నాకు గుర్తే. ఎంత మంచి పాలు పోసినా, నీళ్ళు కలిపి తెచ్చావేమిటని

అమ్మగారు గొడవ పెట్టేసుకునేవారు ... ఓ పట్టాన నమ్మే వోరు కారు. ఆ విషయాలన్నీ ఎట్ట మరిచిపోతానండీ! ఇక్కడ మంచి పాలు దొరుకుతున్నాయాండీ!’’ అడిగేడు ఆంజనేయులు.

‘‘లేదోయ్ ... ఇక్కడ మంచి పాలు దొరకవు ... కల్తీ ... నీపాలు చాలా బెటర్ అని అప్పుడప్పుడూ మా ఆవిడ అంటూ వుంటుందోయ్.’’

ఆ మాటకు ఎంతో సంతోషించేడు ఆంజనేయులు. అంతలోనే విచారంగా మొహం పెట్టి ‘‘అయితే అమ్మగారు పాలకు ఇబ్బంది పడుతున్నారన్నమాట’’ అన్నాడు.

‘‘ఏం చేస్తాం తప్పదు మరి ... సిటీ బతుకు కదా!’’

‘‘ఇక్కడ అన్నిటికీ కష్టమే సార్! మళ్ళీ మా వూరికి బదిలీ చేయించుకో కూడదూ!...’’

సమాధానంగా నవ్వేడు మూర్తి. తర్వాత అన్నాడు ‘‘ఇప్పుడు మీ వూరు అలానే వుందా! ఏమైనా మారిందా’’ అన్నాడు.

‘‘ఏం మారాలండీ!?... అసలు మా వూరికి ఏ మార్పు అవసరం? చల్లగా పారే పంటకాలవల్ని పూడ్చాలా ... పచ్చని పైర్లను మాడ్చాలా! మామిడి తోటలు నరకాలా, కొబ్బరి తోపుల్ని కొట్టాలా ... వూరికి పశ్చిమాన వున్న శివాలయం కూల్చాలా, ఆ ప్రక్కనే వున్న రాజాగారి, దివాణం పడగొట్టాలా ... దక్షిణాన వున్న దేవుడి చెరువు పూడ్చాలా, ఏం చేసి మార్చాలి! మా వూరివి! ... మా వూరికి ఏ మార్పూ అవసరం లేదండి. అది స్వర్గమండీ’’ ఆనందాతి రేకంతో అని అలుపు వచ్చిందో ఏమో వూపిరి బలంగా పీల్చుకున్నాడు ఆంజనేయులు.

‘‘మీ వూరి పట్ల నీకున్న మక్కువను చూస్తుంటే సంతోషంగా వుందోయ్ నాకు’’ అనేసి చిన్నగా నవ్వేడు. తర్వాత టైమ్ చూసుకుంటుంటే ... ఆంజనేయులు గమనించి – ‘‘ఏం సార్ అర్జంటుగా వెళ్ళాలా ఆఫీసులోకి’’ అవడిగేడు.

‘‘ఔనోయ్ ... పనుంది ... నేను వుండనా మరి?’’ అన్నాడు మూర్తి.

‘‘ఇంటికి ఏ టైముకు వెళ్తారు సార్?’’ తల గోక్కుంటూ అడిగేడు ఆంజనేయులు.

‘‘ఎందుకు!’’ అనబోయి ఓ క్షణం ఆగేడు. ఆలోచించేడు. అతనికి తన ఇంటి దాకా రావాలని – తన భార్య పిల్లల్ని చూసి పోవాలనున్నట్లు గ్రహించేసేడు మూర్తి.

ఈ పల్లెటూరి మొహాన్ని ఈ అగ్లీ అవతారాన్ని ఇంటికి ఆహ్వానిస్తే ఏమైనా వుందా? తన నైబర్స్ ఎటువంటి క్లాస్ పీపుల్? పొరపాటున ఓ రోజు వుండి వెళతానని గనుక అంటే – అతనికి తన ఇంట్లో స్నానం, భోజనం – పడక ఏర్పాటు చేయడం ... కుదిరే విషయాలేనా?

‘‘ఏం సార్ ఆలోచిస్తున్నారు. ఇంటికి ఏ టైముకు వెళ్తారు’’ అనేసి అతను మళ్ళీ ప్రశ్నించడంతో వులికిపాటుగా ఆలోచనలోంచి ఇవతల కొచ్చేడు మూర్తి.

‘‘ఆ ... ఆ... ఇంటికా? ... రోజూ అయితే మధ్యాహ్నం రెండు గంటలప్పుడు వెళ్తాను. ఈ రోజు వెళ్ళను.’’

‘‘ఎందుకని సార్!’’

‘‘ఫామిలీ లేదోయ్ ఆంజనయులూ. నిన్ననే వాళ్ళ పుట్టింటికి వెళ్ళారు ... పిల్లలు కూడా లేరు’’ అన్నాడు ... చాలా సింపుల్ గా అబద్ధమాడేడు.

అయ్యయ్యో నేను దురదృష్టవంతుణ్ని సార్ ... చాన్నాళ్ళకు ఈవూరు వచ్చాను కదా అమ్మగార్నీ, పిల్లలను చూసి వెళ్ళొచ్చనుకున్నా సార్.’’

‘‘అవునోయ్ పాపం. రాక రాక వచ్చావు. సర్లే ఈసారి ఎప్పుడైనా వస్తే రా ఇంటికి. నువ్వు ఈ వూరు వచ్చి వెళ్ళావని పిల్లలకీ ... మా వాళ్ళకీ చెబుతాన్లే’’ అనేసి మళ్ళీ టైమ్ చూసుకుంటున్నాడు మూర్తి.

‘‘సరే సార్! పాపం మీకు టైమ్ లేనట్టుంది ... వుంటాను ... వస్తాను సార్? ఇంద ... ఈ సంచి వుంచండి సార్’’ అంటూ అంతసేపూ తన చేతిలో బరువుగా వున్న ఆ సంచిని అందించేడు ఆంజనేయులు.

‘‘ఏమిటవి? ఎందుకు?’’ అంటూనే అప్రయత్నంగా అందుకున్నాడు మూర్తి ఆ సంచిని.

‘‘మీ పిల్లల కోసం తెచ్చాను సార్.. పళ్ళు. వుంచండి ... మరి నేనుంటాను సార్ ... అమ్మగారినీ పిల్లల్నీ అడిగినట్లు చెప్పండి’’ అంటూ వెళ్ళి పోయాడు ఆంజనేయులు.

సంచి మురికిగా వుండడంతో ఇబ్బందిగా మొహం పెట్టిన మూర్తి సంచి లోపల ఓ నలభై రూపాయల ఖరీదు చేసే యాపిల్స్ – అరటిపళ్ళు, బత్తాయిలు, కమలాలు చూశాక ... ప్రసన్నమయ్యేడు.

***

‘‘లలితా ... పళ్ళు తీసేసి ఆ సంచిని బయట పారేయ్! మరీ దర్టీగా వుంది’’ అన్నాడు భార్యతో మూర్తి.

ఎవరిదండీ ఇది ... ఎక్కడివి ఇన్ని పళ్ళు! కొన్నారా?’’

‘‘లేదు ... ఆంజనేయులు తెచ్చాడు. అదే మైలవరంలో వుండగా మనకు పాలు పోసేవాడే అతను – అతను తెచ్చాడివి.’’

‘‘ఏడతను ...? వచ్చాడా మనింటికి?’’ ఆత్రంగా అడిగింది.

‘‘మనింటికెందుకూ! పిల్చుకురాలేదు నేను. ఊళ్ళకు వెళ్ళేటప్పుడైనా శుభ్రంగా రావాలా? ఎంత అసహ్యంగా వున్నాడని!’’

తనకేమీ కాని మనిషి, ఎప్పుడో పొట్లాడుతూనే పాలుపోయించుకున్న వాళ్ళ కోసం వెతుక్కుంటూ వస్తే ‘మనింటి కెందుకూ?’ అంటున్నాడు! ఆంజనేయులు అసహ్యంగా కనిపించలేదు లలితకు. తన భర్త మూర్తే అసహ్యంగా కనిపిస్తున్నాడు! ‘‘ఛీ! మీరు మనిషి కాదు’ అంది.

తనమనిషి కాదా? భార్య ముఖం కేసి ఆశ్చర్యంగా చూశాడు మూర్తి. ●

## అపోహ వాస్తవం

డా॥ C.S.N. వీరేశ్



**అపోహ 1 :** పసిపిల్లలకు ఒక పద్ధతి ప్రకారం ఖచ్చితమైనవిరామంలలో పాలు పట్టాలి ( **Scheduled feeding** ) అలా కాక మధ్యమధ్యలో బిడ్డ ఏడ్చాడు కదాని పాలుపడితే క్రమశిక్షణ లేక బిడ్డ చెడిపోగలదు.

**వాస్తవం :** పసిపిల్లలకు ఎప్పుడెప్పుడు పాలు పట్టాలి అన్న విషయం వీలైనంత వరకు వారికే వదిలేస్తే మంచిది. కాల్కక్రమేణా పిల్లలు వారికి వారే ఒక నిర్దిష్ట విరామం ఏర్పరుచుకొని 3 లేక 4 గంటలకొకసారి ఏడ్చి పాలు త్రాగటం తల్లిపాలుతాగే పిల్లలకు అలవాటైపోతుంది.

పై చెప్పిన **‘‘Scheduled feeding’’** అన్నది పోత పాలు త్రాగే పిల్లలకూ,అవీ ఆస్పత్రులలో నర్సుల సౌకర్యార్థం ఏర్పడిన పద్ధతి పసిపిల్లలకు మంచిదైన పద్ధతి ఏమీ కాదది. ముఖ్యంగా తల్లిపాలు తాగే పిల్లలకు ఇటువంటి క్రమశిక్షణకు ఏ అవసరం లేదు. బిడ్డ అడిగినప్పుడల్లా పాలివ్వడం ( దీనినే **Demand feeding** అంటారు ) మంచి పద్ధతి. బిడ్డ ఆకలే నిర్ణీత కాలాలని నిర్ణయిస్తుంది. అనతి కాలంలోనే తల్లులు తమ బిడ్డల ఏడ్పులను గుర్తిస్తారు. అది ఆకలి ఏడుపా లేక మరే కారణమైనా వుందా అని.